క్లుప్తంగా

గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి



ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఆదివాసీ ఉద్యోగుల సంఘం, గిరిజన జేఏసీ నేతలు

అరకులోయ రూరల్: గిరిజన హక్కులు చట్టాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆదివాసీ జేఏసి జిల్లా కన్వీనర్ రామరావుదొర, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజి శంకర్ రావును కోరారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేసినట్టు వారు తెలిపారు, గిరిజన ప్రాంతంలో ఆదివాసీ హక్కులు చట్టాల పరిరక్షణకు, నకిలీ ధ్రువీకరణల జారీ, 1/70,పీసా చట్టాలు, అటవీ హక్కుల చట్టాలు పకడ్బందీగా అమలు చేసే విధంగా దృష్టి సారించాలని కోరామన్నారు. దీనిపై ఆయన సానుకులంగా స్పందించి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు సింహచలం, గురుదొర, సింహాచలం, కామేశ్వరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

చింతపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలురు, బాలికల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 3 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్ఎంలు పండన్న, కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఖాళీలకు సంబంధించిన వివరాలను పాఠశాలల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాలలను సందర్శించాలని వారు కోరారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలో పద్మాపురం పంచాయతీలో హుకుంపేట మండలం గున్నగుమి గ్రామానికి చెందిన యువకులు వాలీబాల్ ఆట తిలకిస్తున్న సమయంలో శనివారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడడంతో గెమ్మెలి రంగరావు, గిన్నెల సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్చగా పరిస్థితి విషమించడంతో గెమ్మెలి రంగారావు(35) మృతి చెందాడు.. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆదివారం ఆస్పత్రిని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సింగరావు తదితరులున్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు

కోటవురట్ల : తంగేడు గ్రామంలో శ్రీ తలుపులమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. గ్రామంలో అందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి మొక్కారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్. రామచంద్రరాజు, పార్టీ నాయకులు ఆర్.ఎస్.లక్ష్మీ నరసింహరాజు, సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఆవ కాలువ సంఘ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పండగ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ రైతులంతా ఊరేగింపుగా గ్రామం నుంచి బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



పాలమామిడిలో రైతు భరోసా కేంద్రం భవనం



పాలమామిడిలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం

ప్రగతికి C/o పాలమామిడి

- కోట్లాది రూపాయలతో రోడ్లు, వంతెనలు
- సెల్ టవర్ ఏర్పాటుతో తొలగిన సాంకేతిక సమస్య
- శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు
- ఆనందంలో గిరిజనులు

పంచాయతీలో అభివృద్ధి పనులివీ...

- రూ.40లక్షలతో గ్రామ సచివాలయం భవనం నిర్మాణం
- రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.17.50లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవనం
- రూ.2.40కోట్లతో కొక్కిరాపల్లి, బొడ్డగొంది-లక్కుళు,పెదపాడ్లు తారురోడ్డు, బ్రిడ్జి పనులు
- నాడు-నేడు కింద రూ.30లక్షలతో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు
- రూ.16లక్షలతో లక్కుళ్ల గ్రామంలో సీసీ రోడ్డు
- రూ.14లక్షలతో కొక్కిరాపల్లి గ్రామంలో సీసీ రోడ్డుకు
- రూ.40లక్షలతో బొడ్డగొంది-చిట్టంపాడు, వల్లంగుల,పెదపాడు రోడ్డు అభివృద్ధికి
- రూ.2.40కోట్లతో కొక్కిరాపల్లి-బొడ్డగొంది, లక్కుళ్ళు బిటీ రోడ్డు
- రూ.14లక్షలతో కొక్కిరాపల్లిలో తాగునీటి పథకాలు
- రూ.7లక్షలతో చీకుంబంద గ్రామంలో రక్షిత మంచినీటి పథకం
- రూ.5లక్షలతో వనభంపాడు గ్రామంలో తాగునీటి పథకం
- రూ.3లక్షలతో కొంతలం గ్రామంలో మంచి నీటి పథకం
- రూ.5లక్షలతో వల్లంగుల, చిట్టంపాడు గ్రామాల్లో నీటి పథకాలు
- నాడు- నేడు ద్వారా రూ.60లక్షలతో ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు
- పాలమామిడిలో నాడు-నేడు ద్వారా రూ.22లక్షలతో పాఠశాల అభివృద్ధి
- కొంతలం గ్రామంలో నాడు-నేడులో పాఠశాలకు రూ.14లక్షలు
- చీకుంబంద గ్రామంలో పాఠశాలకు నాడు-నేడు కింద రూ.15లక్షలు
- ఏడుచావళ్ల గ్రామంలో పాఠశాలకు నాడు-నేడు కింద రూ.12.50లక్షలు
- రూ.15లక్షలతో కొంతలం గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవనం
- రూ.1.50లక్షలతో ఏడుచావళ్ల గ్రామంలో బోరు ఏర్పాటు
- రూ.1.50లక్షలతో కొంతలం గ్రామంలో బోరు ఏర్పాటు
- రూ.3 లక్షలతో బొడ్డగొంది గ్రామంలో తాగునీటి పనులు
- రూ.3 లక్షలతో లక్కుళ్ల గ్రామంలో తాగునీటి పనులు.



బొడ్డగొంది- లక్కుళ్లు, గెడ్డపై రోడ్డు, వంతెన (నేడు)



బొడ్డగొంది, లక్కుళ్లు మార్గంలో గెడ్డ వద్ద అవస్థలు పడుతున్న గిరిజనులు(నాడు)



పాలమామిడిలో పాఠశాల భవనం



లక్కుళ్లు గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు



పైదపాడులో సెల్‌టవర్



ఏడుచావళ్ల గ్రామంలో నీటి కుళాయి

జి.మాడుగుల: నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు తాగునీటి డ్రైనేజీ, గ్రామాల్లో అధ్వాన రోడ్లుతో అవస్థలు పడేవారు. ప్రభుత్వ సేవలందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. చంద్రబాబు పాలనలో ప్రతీ పనికి జన్మభూమి కమిటీలు ప్రజల నుంచి అక్రమంగా సొమ్ములు వసూలు చేసేవారు.. నెలల గడిచిన ఒక్క పని చేసేవారు..ఏజెన్సీలోని ఏ ప్రాంతంలోనూ ఒక్క అభివృద్ధి పని జరిగిన దాఖలాలు లేవు...దీంతో గిరిజనులు ఏళ్ల తరబడి సమస్యలతో కాలం గడిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్యంలోని శివారు గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కనిపిస్తోంది...ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలుచేశారు. దీంతో వారి బతుకుల్లో వెలుగులు నిండాయి. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేడు మన్యంలో అన్ని ప్రాంతాలు ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయి.గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి గ్రామ వలంటీర్ వ్యవస్థతో గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోనికి తెచ్చారు.అవినీతి రహితంగా, ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా సేవలను ప్రజల చెంతకు చేర్చటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని గిరిజనులు బాహాటంగా చెబుతున్నారు.

అభివృద్ధికి నిధులు

జి.మాడుగుల మండలం పాలమామిడి సచివాలయంలో పరిధిలో గల 14గ్రామాలు సుమారు 3000మంది జనాభా ఉన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ఆయా గ్రామాల్లో సమస్యలతో ప్రజల సతమతమవుతుండేవారు. కనీస అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోని రాగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయి. పంచాయతీ కేంద్రంలో సచివాలయం ద్వారా అందరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. డీబీటీ ద్వారా పలు పథకాలు ద్వారా లబ్ధిదారులకు రూ.4,69,459.45 కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. నాడు పంచాయతీల్లోని గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, తాగునీరు లేక గిరిజన ప్రజలు ఇబ్బందులు పడేవారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కుళాయిలు, బోర్లు ఏర్పాటు చేశారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సకాలంలో రైతులకు విత్తనాలు ఎరువులు, ఇతర సేవలు అందిస్తున్నారు.పాలమామిడి పంచాయతీల్లో పలు గ్రామాల్లో తాగునీటి పథకాలకు రూ.33లక్షలు వ్యయం చేసింది.

సమస్య తీరింది



మా గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కనీస అభివృద్ధి పనులు జరగలేదు. గ్రామంలో వీధి రోడ్లు సమస్య ఉంది. వర్షాకాలంలో బురదమయంగా ఉండడం వలన నడవటానికి ఇబ్బందులు పడేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. లక్కుళ్ల గ్రామానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి, తారు రోడ్డు నిర్మాణంతో గ్రామస్తుల ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైంది.

– కిల్లో రాంబాబు, లక్కుళ్ల గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం



లక్కుళ్ల గ్రామంలో ప్రజలంతా తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడేవారం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులకు, అధికారులకు చాలాసార్లు నీటి సమస్యను తెలియజేసినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సమస్యను అధికారులు, సర్పంచ్‌కు తెలియజేశాం. వారు వెంటనే స్పందించి మంచినీటి పథకం నిర్మించారు. కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ప్రజా సంక్షేమం కాంక్షిస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– పాంగి కుమారి, లక్కుళ్ల గ్రామం

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



సచివాలయం పరిధిలో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాం. అన్ని గ్రామాల్లో తాగునీటి బోర్లు, పథకాలు ఏర్పాటు అయ్యాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు పనులు చేపట్టాం. నవరత్నాల పథకాలు అర్హులందరికీ అమలు చేశాం.అవినీతి రహిత, మధ్యవర్తిత్వం లేని పాలన కొనసాగిస్తున్నాం .ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నాం.

– సురభంగి రామకృష్ణ, సర్పంచ్, పాలమామిడి

6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు



సీఐ సన్యాసినాయుడు



కౌంటింగ్ విధి విధానాలపై పోలీసుశాఖ విస్తృత ప్రచారం

రాజవొమ్మంగి: రంపచోడవరంలో జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా ప్రజలు ఎవరూ గుమికూడి ఉండవద్దన్నారు. ఫలితాలు వెలువడిన తరువాత గెలుపు సంబరాలు, బాణాసంచా వెలిగించడం వంటి చర్యలు నిషేధమన్నారు. ఎవరూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టవద్దన్నారు. రాజవొమ్మంగిలో పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 24/7 పోలీసు పికెటింగ్ ఉంటుందన్నారు. రంపచోడవరంలో జరగనున్న కౌంటింగ్ కేంద్రానికి పాస్‌లు ఉన్న వారినే చెక్ పోస్టుల వద్ద అనుమతిస్తామన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే 9440900766 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అడ్డతీగల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అడ్డతీగల సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ పాటు సెక్షన్ 30 అమలులో ఉందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవికుమార్ తెల్లిపారు.ఈ మేరకు గ్రామాల్లో మైక్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది గుంపులుగా ఉండవద్దన్నారు.పోలీసుశాఖ ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు గాని బహిరంగ సభలు, సమావేశాలు గాని నిర్వహించొద్దని సూచించారు.విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు.బాణాసంచా కాల్చడం గాని వీధుల వెంట గెలుపు సంబరాల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం పూర్తిగా నిషేధమన్నారు. రంపచోడవరం కౌంటింగ్ కేంద్రం వద్దకు కేవలం పాసులు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఉందన్నారు. కీలక ప్రాంతాల్లో పోలీస్ చెక్‌పోస్టులు, పికెట్‌లు ఏర్పాటుచేశామన్నారు.పోలీసుశాఖ ఆదేశాలు పాటించకుండా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

అందుబాటులో విత్తనాలు



కూనవరం ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న వరి విత్తనాల స్టాకు

కూనవరం: తొలకరి వానలు పలకరించక ముందే రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు వచ్చాయి. గతం టీడీపీ ప్రభుత్వం సకాలంలో రైతులకు విత్తనాలు అందే పరిస్థితి ఉండేది కాదు. గత్యంతరం లేక రైతులు ప్రయివేటు షాపుల్లో నాసిరకం విత్తనాలు కొని తీవ్రంగా నష్టపోయేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు విత్తనాల కొరతలేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సీజన్‌కు ముందస్తుగానే విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయి. మండల పరిధిలో ఖరీఫ్ విత్తనాలు (వరివిత్తనాలు) అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారిణి పీ శ్రీలక్ష్మి తెలిపారు. అన్ని గ్రామాలకు సంబంధించిన రైతులకు 820 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంటియు-1121, బీపీటీ-5204 రకం వరి విత్తనాలు ఆర్‌బీకేల్లో ఉన్నట్టు తెలిపారు. రైతులందరూ వరి విత్తనాలను 90 శాతం సబ్సిడీపై సచివాలయం పరిధిలోని వ్యవసాయ శాఖ గ్రామ అసిస్టెంట్ ద్వారా పొందాలని సూచించారు.

9 నుంచి అమ్మవారి ఉత్సవాలు



మోదకొండమ్మ ఉత్సవాల శతకంపట్టు ముహూర్తపు రాట కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, నాయకులు

పెదబయలు: మన్య ప్రజల ఇలవేల్పు ఆరాధ్య దైవం పెదబయలు మోదకొండమ్మ ఉత్సవాల ఘనంగా నిర్వహించడానికి అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఉత్సవ కమిటీ సభ్యులు. గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ ప్రాంతంలో శతకంపట్టు వద్ద ముహూర్తపు రాట వేసే కార్యక్రమం ప్రారంభించారు. మోదకొండమ్మ ఉత్సవాలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నట్టు చెప్పారు.

ఉత్సవాలకు ఏడు రోజులకు ముందుగా శతకంపట్టులో రాట ఏర్పాటు శతకంపట్టు నిర్మాణం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉత్సక కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ముహూర్తపురాటకు ప్రత్యేక పూజలు చేసిన ఉత్సవాలు ప్రారంభం రోజున ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, శతకంపట్టు వద్ద ఉంచి, మూడు రోజుల పూజల అనంతరం చివరి రోజు భారీ ఊరేగింపుతో ఆలయంలో ఉత్సవ విగ్రహం, పాదాలు యథా స్థానంలో చేరుస్తామని పేర్కొన్నారు.మోదకొండమ్మ ఉత్సవాల్లో శతకంపట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎంతో భక్తిశ్రద్ధలతో రాట ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో శతకంపట్టుకు రాట ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీంతో పెదబయలు మండలంలో మోదకొండమ్మ ఉత్సవాల పనులు ప్రారంభమైనట్టు తెలిపారు. కార్యక్రమానికి వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, వర్తక సంఘం నాయకులు త్రినాథ్, మోటార్ యూనియన్ నాయకులు నీలయ్య, గ్రామ పెద్దలు సూరయ్య, రాంబాబు, అజయ్‌కుమార్, చిట్టిబాబు,ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వర్తకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి : గాంధీనగరం అంజయ్యకాలనీలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం గాంధీనగరం వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు రేజేటి చక్రవర్తి నిర్వహించారు. లోక కల్యాణార్థం కల్యాణాన్ని నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. కల్యాణాన్ని పురస్కరించుకుని శివపార్వతుల జీవితచరిత్ర గురించి భక్తులకు ఆయన వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న హనుమ సేవాశ్రమం అధిపతి సాయిరాం స్వామిజీ



ఆలయ ఆవరణలో మహిళల కోలాటం

జి.మాడుగుల: మండలంలో గాంధీనగర్ శ్రీ హనుమ సేవాశ్రమంలోని పంచముఖ అంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు విశాఖ జిల్లా భీమిలికి చెందిన సద్గురు సేవాశ్రమం అధిపతి సాయిరాం స్వామిజీ అధ్వర్యంలో రెండు రోజుల పాటు ఘనంగా ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి వార్షికోత్సవ ముగింపు రోజు కావడంతో ఏజెన్సీలో గల పలు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కోలాటాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పద్య పఠనంతో ధారణశక్తి

పాయకరావుపేట : పట్టణంలో గల గ్రంథాలయంలో చిన్నారుల పద్య పఠనం అలరించింది. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పద్య పఠనంపై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు విద్యార్థులకు పద్య పఠనం పై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

రహదారిపై కూలిన చెట్టు తొలగించరూ..



రోడ్డుపై కూలిన చింతచెట్టు

కొయ్యూరు: రాజేంద్రపాలెం నుంచి డొడ్డవరం వెళ్లే రహదారి మధ్యలో చింతచెట్టు కూలి మూడు రోజులు కావస్తున్నా నేటికి తొలగించలేదని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా ఈ దారి మీదుగా బూదరాళ్ల వెళ్లేందుకు బస్సు సర్వీసు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న పామాయిల్ తోటల మీదుగా ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తున్నాయన్నాంటున్నారు. కారులు, ఆటలో తదితర వాహనాలు వెళ్లే ఆస్కారం లేదని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకోని సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి జేఈ రామకృష్ణ మాట్లాడుతూ మర్రివాడ పంచాయతీ కార్యదర్శికి చెట్టును తొలగించాలని తెలిపామన్నారు, తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలియజేస్తామన్నారు